క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం


విరాళంను అందజేస్తున్న దాత, కుటుంబ సభ్యులు

కాణిపాకం: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయాభివృద్ధికి రూ.1.16 లక్షల విరాళాన్ని హైదరాబాద్‌కు చెందిన దాత కీర్తి విహన్ ఆలయాధికారులకు అందజేశారు. దాత స్వామివారి దర్శనార్థం మంగళవారం కాణిపాకం విచ్చేసి ఆలయ అభివృద్ధికి విరాళం అందించారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయాధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై జాగ్రత్తలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వేంకటేశ్వరరావు

పూతలపట్టు: ప్రతి ఒక్కరూ దంత సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి వేంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో దంతసంరక్షణ వారోత్సవాల్లో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం, రాత్రి పూట తప్పకుండా దంతాలను శుభ్రపరుచుకోవాలని, అతి చల్లని, అతి వేడి పదార్థాలను తీసుకోకూడదని తెలిపారు. పళ్ల మధ్య ఇరుక్కున్న పదార్థాలను తీయడానికి పుల్లలను ఉపయోగించుకూడదని, ఆహార పదార్థాలు తిన్న తర్వాతా నోటిని నీటితో పుక్కిలించాలని తెలిపారు. పంటి నొప్పి, చిగుళ్లలో రక్తం రావడం వంటివి వచ్చినప్పుడు తప్పకుండా దంత వైద్యుడిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రియాంక, ప్రవీణ, సీహెచ్‌ఓ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మరణాన్ని దిగమింగుకుని..


పరీక్ష కేంద్రానికి వెళుతున్న విద్యార్థి సంతోష్

ఐరాల: అనారోగ్యంతో తండ్రి మరణించగా, మంగళవారం ఆ బాధను దిగమింగుకుని పదో తరగతి విద్యార్థి పరీక్షకు హాజరయ్యాడు. వివరాల్లోకి వెళితే.. ఐరాల మండలం వీఎస్ అగ్రహారంలో నివాసముంటున్న చలపతి, మీనా దంపతులకు కుమారుడు సంతోష్, కుమార్తె నిత్య ఉన్నారు. మంగళవారం చలపతి (42) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుమారుడు సంతోష్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం అతను పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్నాడు. తండ్రి లేడన్న బాధను దిగమింగుకుని సంతోష్ మంగళవారం పదో తరగతి పరీక్షకు హాజరై బయాలజీ పరీక్ష రాశాడు. అనంతరం తండ్రి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, స్నేహితులు సైతం విద్యార్థికి మనోధైర్యాన్నిచ్చారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించాలి


నాయకులతో మాట్లాడుతున్న రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్

చిత్తూరు రూరల్: వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం అందరూ సమష్టి కృషి చేయాలని రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ అన్నారు. చిత్తూరులోని తన కార్యాలయంలో ఆయన మంగళవారం గంగాధరనెల్లూరు నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేయాలన్నారు. పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజారిటీ గెలిపించాలన్నారు.

2, 3న గంగమ్మ జాతర



పుంగనూరు: పుంగనూరు శ్రీసుగుటూరు గంగమ్మ జాతర చాటింపును మంగళవారం సాయంత్రం తోటి కులస్తులు వేశారు. జమీందారుల కుల ఆరాధ్య దైవమైన సుగుటూరు గంగమ్మ జాతరను ఏప్రిల్ 2, 3వ తేదీలలో నిర్వహించనున్నట్లు జమీందారులు తెలిపారు. తోటి, బెస్త, పట్టణ ప్రముఖులు, అర్చకులతో జమీందారులు సమావేశం నిర్వహించి జాతరను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భక్తులకు తగ్గ ఏర్పాట్లు చేయాలని నిశ్చయించారు.

జగనన్నది సంక్షేమ పాలన

- సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప, డాక్టర్ సునీల్‌కుమార్ అభ్యర్థన
- సంక్రాంతిపల్లె, గుండ్లకట్టమంచిలో జోరుగా ఎన్నికల ప్రచారం


గుండ్లకట్టమంచిలో ప్రచారం చేస్తున్న రెడ్డెప్ప, డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి రెడ్డెప్ప అన్నారు. మండలంలోని సంక్రాంతిపల్లె, గుండ్లకట్టమంచి, దళితవాడ, నల్లశిద్ధనపల్లె గ్రామాల్లో మంగళవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ, 58 నెలల పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాల్లో రూ 2.74 లక్షల కోట్లు జమ చేసి, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత జగనన్నకే దక్కిందని స్పష్టం చేశారు. నామినేటెడ్ పోస్టుల్లో సైతం మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థతో సుమారు 4 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. పేదలకు అండగా నిలిచిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు సీఎంగా చేసేందుకు వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రెడ్డెప్పను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో పాల ఏకరి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుమార్‌రాజా, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, కో–ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్, స్థానిక సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మొగిలీశ్వర్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, కార్యదర్శి మణిరాజ్, ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షుడు నాగరాజ, దొరస్వామి, మైనారిటీ నాయకుడు ముబారక్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పాలాక్షిరెడ్డి, ఎన్‌ఆర్‌ఐ భరత్, రైతు సంఘం మాజీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జయదేవ్‌రెడ్డి, మొగిలిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపులో సచివాలయ కన్వీనర్లే కీలకం

తవణంపల్లె: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వైఎస్సార్‌సీపీ గెలుపులో కీలకపాత్ర పోషించాలని పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని నారాయణాద్రి కల్యాణ మండపంలో మండల సచివాలయ కన్వీనర్ శరత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు హరిరెడ్డి ఆధ్వర్యంలో రానున్న ఎన్నికల్లో ఎలా విజయం సాధించాలనే వ్యూహంపై సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న వస్తేనే సంక్షేమం బాట వేస్తారని, చంద్రబాబు వస్తే ప్రజలు అధోగతి పాలవుతారని విమర్శించారు. ప్రతిపక్షాలు కల్లబొల్లి మాటలు చెప్పి నెరవేర్చలేని హామీలను నమ్మి మోసపోకూడని ప్రజలకు స్పష్టంగా వివరించాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హరికృష్ణారెడ్డి, మధుకుమార్, కిషోర్ రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, పరమేశ్వరరెడ్డి, సుకేష్‌రెడ్డి, రవిరెడ్డి, విక్కీరెడ్డి, దినేష్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, బాబురెడ్డి, భాస్కర్‌నాయుడు, కోదండన్, దామోదరం, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకులైన వలంటీర్లపై విమర్శలా?

ప్రజలకు నిరంతరం నిస్వార్థంగా సేవలందించిన వలంటీర్లను విమర్శిస్తే రానున్న ఎన్నికల్లో ప్రజలే తగు బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి ఒక ఇంటర్వ్యూలో వలంటీర్లను తీవ్రవాదులుగా చిత్రీకరించి, మాట్లాడడంపై తీవ్రంగా ఖండించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేసి, ప్రజలతో మమేకమైన వలంటీర్లపై టీడీపీ బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. కరోనా సమయంలో ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవలందిస్తే టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు జలగల్లాగా ప్రజలను పీడించారని దుయ్యబట్టారు. వలంటీర్లను తీవ్రవాదులుగా విమర్శలు గుప్పించిన సుధీర్‌రెడ్డి మాటలను వెనక్కితీసుకోవాలని, లేనిచో రానున్న ఎన్నికల్లో ప్రజలే తగు బుద్ధి చెబుతారని మండిపడ్డారు. సమావేశంలో పార్టీగ మండల అధ్యక్షుడు హరిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ శరత్‌రెడ్డి, పార్టీ శ్రేణులు హరికృష్ణారెడ్డి, పరమేశ్వరరెడ్డి, మధుకుమార్, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తవణంపల్లె: మాట్లాడుతున్న సునీల్‌కుమార్


విలేకరులతో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

‘స్పందన’ భవన నిర్మాణ పనులు పరిశీలన


స్పందన భవనం పనులు పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : స్పందన కార్యక్రమం నిర్వహణకు కలెక్టరేట్‌లో నిర్మిస్తున్న నూతన భవనాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, స్పందన భవనంలో మౌలిక వసతులు అన్నీ ఉండేలా చూడాలని, పనులను త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తేవాలని, అలాగే ఫర్నీచర్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్, పెయింటింగ్ పనులు కూడా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో చిత్తూరు ఆర్‌డీఓ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారికి వసంతోత్సవం


వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పుంగనూరు: పట్టణంలో కోనేటి వద్ద ఉన్న శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు మంగళవారం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు, ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో పూజలు, హోమాలు చేశారు. శ్రీవారికి వసంతోత్సవం అనంతరం పురవీధులలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సదుం: జూదం ఆడుతున్న ఆరుగురిని మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ మారుతి తెలిపారు. పాలమంద సమీపంలోని సవటకుంట వద్ద పేకాట ఆడుతున్న సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. జూదగాళ్లను అరెస్ట్ చేసి రూ.5270 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వైభవంగా పుష్పయాగం

బైరెడ్డిపల్లె : మండలంలో కడపనత్తం సమీపంలోని శ్రీ నల్లగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పుష్పయాగం ఘనంగా నిర్వహించారు. అలివేలు మంగమ్మ, పద్మావతి సమేత శ్రీ నల్లగుండ్రాయస్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి, వేదికపై కొలువుదీర్చి, వేదపండితులు పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అలాగే నెల్లిపట్ల సమీపంలోని శ్రీమరగదాంబ సమేత శ్రీ మార్గ సాహేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి మెరవణి నిర్వహించారు.


విశేష అలంకరణలో అలివేలుమంగమ్మ, పద్మావతి సమేత నల్లగుండ్రాయస్వామి

ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరాజుపురం పంచాయతీ ఏట్టుకూరిపల్లెలో వెలసిన ఎల్లమ్మతల్లికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, అంబలి సమర్పించారు. ఈ సందర్భంగా వేకువనే అమ్మవారిని అర్చకులు సుప్రభాత సేవతో మేల్కొలిపారు. పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో విశేష అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం శ్రీకావేరిరాజుపురంవాసులు పూజా సామగ్రి, వివిధ పుష్పాలు, అంబలితో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని అర్చకులు సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం భక్తులు నైవేద్యంగా సమర్పించిన అంబలిని సేవించారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టారు. మొక్కులు చెల్లించారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి


స్థానికులతో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

- చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మాపాక్షి దళితవాడ–2లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. డివిజన్‌లో సమస్యలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ, గత ప్రభుతం పేదల సంక్షేమం, అభివృద్ధిని విస్మరించాయని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కులమతాలు, రాజకీయాల కతీతంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ పథకాల ఫలాలు అందజేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో అందరూ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. గత పాలన కంటే ప్రస్తుతం నియోజకవర్గం అభివృద్ధి జోరందుకుందని, ఎన్నడూ లేని విధంగా చిత్తూరు చుట్టూ పక్కల వేలాది కోట్ల రూపాయలతో జాతీయ రహదారుల నిర్మాణ పనులు చేస్తున్నట్టు చెప్పారు. దీంతో పరిశ్రమల స్థాపనకు మార్గం సుగమం అవుతోందన్నారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. నగరంలోని ప్రధానమైన సమస్యలను మళ్లీ అధికారంలో వచ్చాక దశలవారీగా జగనన్న నాయకత్వంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి


మరకాలకుప్పం పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

- జాయింట్ కలెక్టర్, ఎన్నికల ఆర్‌ఓ శ్రీనివాసులు

గుడిపాల: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, 172 చిత్తూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలు, రాష్ట్ర సరిహద్దులోని ముత్తరాశికుప్పం చెక్‌పోస్ట్‌తోపాటు మందిక్రిష్ణాపురం, మరకాలకుప్పం, బొమ్మసముద్రం, గట్రాళ్లమిట్ట, డిబిపల్లె, 196 తిమ్మయ్యపల్లె, 197రామాపురంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో లైటింగ్, ఫర్నీచర్, తాగునీరు, నెట్‌వర్క్, వీల్‌చైర్స్..ఇత్యాది సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో చిన్న పాటి మరమ్మతులు ఏమైనా ఉంటే వెంటనే పూర్తి చేయించాలన్నారు. ముత్తరాశికుప్పం చెక్‌పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వాహనాలు తనిఖీచేసే సమయంలో తప్పనిసరిగా వీడియో కవరేజి చేయాలని డబ్బు, మద్యం ఇతర వస్తువులను సీజ్ చేసిన వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అందజేసి, వాహనదారులకు రశీదు ఇవ్వాలని సంబంధిత నోడల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

- మున్సిపల్ కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమాలని పకడ్బందీగా అమలు చేయాలని ఏఆర్వో, మునిసిపల్ కమిషనర్ డాక్టర్ జె అరుణ ఆదేశించారు. నగరంలో ఎన్నికల కోడ్ అమలుపై మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఎంసీసీ, ఎఫ్ఎస్టీ, వీఎస్టీ, లా అండ్ ఆర్డర్, స్వీప్ బృందాలతో ఆమె సమీక్షించారు. నగరంలో నిరంతరం నిఘా ఉంచాలన్నారు. రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసే బ్యానర్లు, జెండాలు, పోస్టర్లను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏ కార్యక్రమమైనా రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల కార్యక్రమాలకు సంబంధించి అనుమతులను పరిశీలించాలన్నారు. ఎన్నికల బృందాలు రోజువారీ నివేదికలను సకాలంలో సమర్పించాలన్నారు. స్వీప్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని, 18 ఏళ్లు నిండిన వారికి ఓటరు నమోదు, ఓటు హక్కు సద్వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఏసీపీ రామకృష్ణుడు, ఆర్వో గోపాలకృష్ణ వర్మ, మెప్మా సీఎంఎం గోపి, స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు మెరుగైన వైద్యం


గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో డాక్టర్ రష్మిత

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని పీహెచ్‌సీ డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, పూర్ణలత అన్నారు. మండలంలోని వేదగిరివారిపల్లె, వీఎస్.అగ్రహారంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్ వేదగిరివారిపల్లెలో 60 మందికి, వీఎస్.అగ్రహారంలో డాక్టర్ పూర్ణలత 70 మందికి వేర్వేరుగా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు వేసవి కాలంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. క్రమం తప్పకుండా టీకాలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాపినాయుడుపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని బాపినాయుడుపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ 37 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి, సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఐరన్ మాత్రలు ప్రతిరోజు వాడాలన్నారు. ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు.

చిత్తపారలో..

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ రష్మిత కోరారు. మండలంలోని చిత్తపారలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు చేశారు. అలాగే గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక రోగుల ఇళ్లకు వెళ్లి వారినీ పరీక్షించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

197 రామాపురంలో..

మండలంలోని 197రామాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని డాక్టర్ అనూష నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. వైద్యసిబ్బంది చంద్ర, హేమలత, సంధ్య, ఇందుమతి, మంజుల పాల్గొన్నారు.


ఐరాల: వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ పూర్ణలత


తవణంపల్లె: బాపినాయుడుపల్లెలో వృద్ధులకు బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్